క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుపై గుంతలు పూడుస్తున్న సిబ్బంది

మొయినాబాద్ రూరల్: దెబ్బతిన్న రోడ్డుకు ఓ దాత మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా నక్కలపల్లి సర్పంచ్ స్వప్న మాట్లాడుతూ మండలంలోని నక్కలపల్లి నుంచి కందవాడ గ్రామ బీటీ రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ఓ దాత చొరవతో శుక్రవారం గుంతలను పూడ్చినట్లు తెలిపారు. దాత కృషి అభినందనీయమని, మరిన్ని సేవ కార్యక్రమాలు చేయాలని సర్పంచ్ కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న సర్పంచ్ జంగయ్య

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మల్లారెడ్డిగూడ సర్పంచ్ జంగయ్య అన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన మైసమ్మ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కే చెన్నయ్య, మాజీ ఉపసర్పంచ్ వెంటకయ్య, నాయకులు గోపాల్, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహులు, శివ, శ్రీనివాస్, ఆంజనేయులు, సత్యనారాయణ, విక్రమ్‌రెడ్డి, సంజీవ, బాలరాజు, రవీందర్‌రెడ్డి, యాదయ్య, రాజేందర్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ముద్దెంగూడ ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రోనిగూడలో మైసమ్మ నూతన ఆలయంలో విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం బోనాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.

ఉమ్రా యాత్ర ముస్లింలకు సన్మానం



బురాన్‌భాయ్‌ని సన్మానిస్తున్న సిద్దేశ్వర్

షాబాద్: పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్తున్న ముస్లింలను ఘనంగా సన్మానిస్తున్నట్లు పీసీసీ చేవెళ్ల నియోజకవర్గ సభ్యుడు రాచమల్ల సిద్దేశ్వర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని హైతాబాద్ నుంచి ఉమ్రా యాత్రకు వెళ్తున్న బురాన్‌భాయ్‌ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో ఉమ్రా యాత్రను పూర్తి చేయాలని సూచించారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



షాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు అమెజాన్ ప్రతినిధులు వెంకట్, కన్సర్న్ ఇండియా సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నాందార్‌ఖాన్‌పేట్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం హైతాబాద్ ప్రాథమిక పాఠశాలలో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు నెలల నుంచి 7 పాఠశాలలో సురక్ష హ్యాండ్ వాష్ ప్రోగ్రామ్ నిర్వహించినట్లు చెప్పారు. అమెజాన్ ప్రతినిధులు లత, వంశీ, వీణ, కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ ఫీల్డ్ ఆఫీసర్ మల్లేష్, సురక్ష వలంటీర్లు అర్చన, రాములు, సత్యనారాయణ పాల్గొన్నారు.

48మంది విద్యార్థుల గైర్హాజరు

షాద్‌నగర్: ఇంటర్ సెకెండ్ ఇయర్ శుక్రవారం జరిగిన గణితం పేపర్ 2, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 48 విద్యార్థులు గైర్హాజరయ్యారు. షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఏడు పరీక్ష కేంద్రాల్లో 1,620 మంది విద్యార్థులకు గాను 1,572 మంది హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 281మందికి గాను 273మంది, మొగిలిగిద్ద ప్రభుత్వ కళాశాలలో 119మందికి గాను 116మంది, ప్రతిభ కళాశాలలో 213 మందికి గాను 208 మంది, విశ్వభారతీ కళాశాలలో 206మందికి గాను 199 మంది, విజ్ఞాన్‌కళాశాలలో 412మందికి గాను 396మంది, విజేత జూనియర్ కళాశాలలో 227మందికి గాను 220మంది, శ్రీ సాయి ఒకేషనల్ కళాశాలలో 162మందికి గాను 160 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల కస్టోడియన్ అధికారులు శ్రీకాంత్, కిష్టప్ప తెలిపారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



జాతీయ పురస్కారం అందుకుంటున్న లింగారెడ్డిగూడ సర్పంచ్, ఎంపీటీసీ



జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో పురస్కారాలు అందుకున్న సర్పంచులు

షాద్‌నగర్: గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులు, సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పేరిట వివిధ విభాగాల్లో ఉత్తమ పురస్కారాలు అందజేసింది. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో ఉత్తమ సేవలు, పనులు చేపట్టిన సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులకు కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రశంసాపత్రాలను అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యకరమైన, చైల్డ్ ఫ్రెండ్లీ, మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక భద్రత, ఉత్తమ పాలన, మహిళా స్నేహపూర్వక, క్లీన్ అండ్ గ్రీన్ తదితర విభాగాల్లో ఎంపికైన లింగారెడ్డిగూడ, బూర్గుల, కమ్మదనం, చిల్కమర్రి, కొండన్నగూడ, గంట్లవెల్లి, మధురాపూర్, అయ్యవారిపల్లి, రాయికల్, శేరిగూడ, చించోడ్, చౌలపల్లి, కుందేలుకుంట తాండ, మొగిలిగిద్ద, వెల్‌జర్ల, ఎలికట్ట, దూసకల్, అన్నారం, హాజిపల్లి గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులకు పురస్కారాలను అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీపీఓలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీఓ కల్యాణి, వైస్ ఎంపీపీ మౌనిక, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అవార్డులు

కొందుర్గు: అందరి సహకారంతోనే గ్రామ పంచాయతీలన్నీ అవార్డులకు ఎంపికయ్యాయని ఎంపీడీఓ అంజనేయులు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోతురాజు జంగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అందించిన దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత వికాస్ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంపిక చేసిన 9 విభాగాల్లో కొందుర్గు మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు 27 పురస్కారాలు రావడం అభినందనీయమన్నారు. ప్రజాప్రతినిదులు, అధికారుల సమష్టి కృషితో ఈ పురస్కారాలు రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, జెడ్పీటీసీ ఎదిర రాగమ్మ, ఎంపీఓ లాలయ్య, ఏపీఎం జయమాలి తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో..

జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యాదమ్మ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌బాబు, ఎంపీఓ విజయ్‌కుమార్ పాల్, జెడ్పీటీసీ బీ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నందిగామను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

నందిగామ: గ్రామాలు అభివృద్ధి చెందితేనే మండలం అభివృద్ధి చెందినట్లని జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ అన్నారు. నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం వైస్ ఎంపీపీ మంజుల ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ పురస్కారాలు – 2023 పొందిన సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. పంచాయతీలు అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు గాను 11 గ్రామాలు పురస్కారాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. మేకగూడ, మోత్కుల గూడ గ్రామ పంచాయతీలకు 5 పురస్కారాలు, నందిగామ, బుగ్గోనిగూడ గ్రామాలకు 3, మామిడిపల్లి, బండోనిగూడ,రంగాపూర్,వీర్లపల్లి గ్రామాలకు 2, అప్పారెడ్డిగూడ, వెంకమ్మగూడ, కాన్హా, గ్రామాలకు 1 చొప్పున పురస్కారాలకు ఎంపికై నట్లు ఎంపీడీఓ తెలిపారు. పురస్కారాలు పొందిన గ్రామాల సర్పంచులను, పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించి, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కే లత, సర్పంచులు జే కుమార్, గోవిందు అశోక్, రమేష్ గౌడ్, చంద్రారెడ్డి, జేకే నర్సింహులు, రాములమ్మ, రజనీత, వీ ఎల్లమ్మ, కవిత, ఎంపీఓ గిరిరాజ్, నాయకులు శ్రీశైలం, రాజు, శ్రీనివాస్, బేగ్, రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, ప్రజల సహకారంతో గ్రామాలు నేడు అభివృద్ధి పథంలో కొనసాగుతున్నాయని చేవెళ్ల ఎంపీపీ ఎం విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం మాలతి అన్నారు. చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జాతీయ పంచాయతీ అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. మండలంలోని 37 పంచాయతీలకు గాను 23 పంచాయతీలకు 27 అవార్డులు వచ్చినట్లు తెలిపారు. వీటిని సర్పంచులకు ఎంపీపీ, జెడ్పీటీసీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిని చూసి అవార్డులు అందజేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కే శివప్రసాద్, ఎంపీడీఓ రాజ్‌కుమార్, సర్పంచులు రమేశ్‌గౌడ్, జహంగీర్, శ్రీనివాస్, రహీమాబేగం, తులసీరాజు, విజయలక్ష్మి, అరుంధతి, లక్ష్మీ, మల్లారెడ్డి, రాజశేఖర్, గాయత్రి, అనూష, ఆర్ నర్సింలు, ఎంపీటీసీ కిష్టయ్య, వెంకటయ్య, ఎంపీఓ విఠలేశ్వర్ పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామమే లక్ష్యం

దామరగిద్దను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్ ఎం వెంకటేశం గుప్తా అన్నారు. చేవెళ్లలో శుక్రవారం జాతీయ పంచాయతీ అవార్డుల్లో భాగంగా దామరగిద్ద పంచాయతీకి ఆరోగ్య పంచాయతీ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తమ పంచాయతీకి ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.



కొందుర్గులో పురస్కారాలు అందుకున్న సర్పంచులు



నందిగామ: జాతీయ పురస్కారాలు అందుకున్న ప్రజాప్రతినిధులు



చేవెళ్ల: అవార్డులు అందుకుంటున్న సర్పంచులు, కార్యదర్శులు

బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్

షాద్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని బీసీలకు గొర్లు, బర్లు వద్దని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కల్పించాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీసీలకు 52శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో ఇంటింట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీసీల ఓట్ల కోసం అగ్రవర్ణాల పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తున్నాయే తప్పా ఏనాడు వారి సమస్యల పరిష్కారం కోసం పని చేయలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో బీసీలకు విద్య, ఉద్యోగం, రాజకీయ, ఆర్థిక రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. బీసీ వర్గానికి చెందిన షాద్‌నగర్ ఎమ్మెల్యే బీసీల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. రాజ్యాంగం కోరుకున్న ప్రజాస్వామ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీఎస్పీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, సుదర్శన్, జయప్రకాష్, మహేష్, చందు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే అందరికీ గౌరవం

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రస్తుత సమాజంలో అందరికీ గౌరవం దక్కుతుందని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండలంలోని సీతారాంపూర్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు తన వంతుగా లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే నేడు అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీతారాంపూర్ సర్పంచ్ పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ సురేశ్‌గౌడ్, సంఘం సభ్యులు మణి, మహేందర్, నర్సింహాచారి, రాజు, రవి, రాములు, యాదయ్య, నర్సింహులు, భరత్, భాస్కర్, రాములు, వంశి, చిన్నయ్య, రవీందర తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



కట్టమైసమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మొయినాబాద్: మండలంలోని సురంగల్ కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శుక్రవారం మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మైసమ్మకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం లావణ్య మాట్లాడుతూ.. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాతిక, దైవ చింతనను అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి, పాండు రంగారెడ్డి భక్తులకు అన్నాదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉపసర్పంచ్ యాదమ్మ, మాజీ సర్పంచులు ఏ లావణ్య, భద్రప్ప, మాజీ ఎంపీటీసీ ఈ రమాదేవి, మాజీ ఉపసర్పంచ్ అంజిరెడ్డి, వార్డు సభ్యులు సుప్రియ, విక్రంరెడ్డి, భాస్కర్, నాయకులు జీ వెంకట్‌రెడ్డి, ఈ రవీందర్‌రెడ్డి, భాస్కరాచారి, రాములు, నర్సింహారెడ్డి, మల్లేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, యాదగిరి యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

శంకర్‌పల్లి: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్ విజయలక్ష్మి ఆకాంక్షించారు. శంకర్‌పల్లి కేజీబీవీలో శుక్రవారం ఆమె విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువులో బాగా రాణిస్తారని, వారికి సరైన ప్రొత్సాహం అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. మీపై మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా రాణించాలని కోరారు. ప్రణాళికబద్ధంగా చదివితే భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. వచ్చే వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించి మండలానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు, వసతులను కల్పించేందుకు తాము సిద్ధంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి మధురవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



సంగెంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని సంగెం, వేములనర్వ, చింతకుంటపల్లి, కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కమ్యూనిటీ భవనాలు, పాఠశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ టీ విశాల, సర్పంచులు రేణుక, మంజుల, పార్వతమ్మ, స్వాతి, కృష్ణయ్య, వైస్ ఎంపీపీ అనురాధ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వీ లక్ష్మీనారాయణగౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు జమాల్‌ఖాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పీ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరీ

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి



మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

షాద్‌నగర్ రూరల్: మున్సిపల్, పంచాయతీ కార్మికులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి శ్రీవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... పంచాయతీ, మున్సిపల్‌లో పారిశుధ్య కార్మికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారే ఎక్కువగా పని చేస్తుంటారని అన్నారు. సకాలంలో వారికి ఇవ్వాల్సిన వేతనాలను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో నిత్యవసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండడంతో ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలు సరిపోవడం లేదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 2/94 రద్దు చేసి గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్‌లకు ప్రత్యేక హోదా కల్పించి అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐతో పాటుగా డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఏ బాబయ్య, డీ అశోక్‌గౌడ్, పీ విష్ణువర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణ, ఎం మురళి, ఎం రుషికేష్, డీ వెంకటేష్ యాదవ్, నరేష్, వరుణ్, నర్సింలు, విఠల్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ఆమనగల్లు: వరిపంటలో అధిక దిగుబడులు పొందడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి కోరారు. ఆమనగల్లు మండల పరిధిలోని రాంనుతల గ్రామంలో వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న మామిడి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నిఖిత, రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్ రూప్‌సింగ్, రైతులు దేశ్య, శంకర్, చక్రి, కృష్ణ, దశరథ్, నర్సింహా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే ‘కంటి వెలుగు’

మున్సిపల్ చైర్మన్ నరేందర్



మహిళకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

షాద్‌నగర్: అంధత్వ నివారణకే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని 26వ వార్డు ఇంద్రానగర్ కాలనీలో కంటి వెలుగు శిబిరాన్ని నరేందర్ ప్రారంభించి మాట్లాడారు. మానవుడి శరీరంలో కళ్లు ఎంతో ప్రధానమైనవని అన్నారు. కంటి సమస్యలు ఏర్పడితే శాశ్వతంగా చూపు కోల్పోయే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కంటి సమస్యలు తీవ్రంగా ఉన్న వారిని గుర్తించి వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని సరోజని దేవి కంటి ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకట్రాంరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

కొందుర్గు: నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన కొందుర్గులో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ ఆశ చూపి అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. ఉప ఎన్నికలు ఉన్న ప్రాంతాల్లో తాత్కాలిక పథకాలు అమలు చేసి ఓట్లు దండుకున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ కుటుంబానికి 30 లక్షల నిరుద్యోగుల ఉసురు తగులుతుందన్నారు. ఉద్యోగాలు వస్తాయనే ఆశతో అప్పులు చేసి కోచింగ్‌లకు వెళితే పరీక్ష పేపర్లు లీక్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. పేపర్ లీకేజీ విషయమై సమగ్ర దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు నరేందర్, శ్యామ్, శ్రీనివాసు రెడ్డి, గోవర్ధన్ గౌడ్, రామస్వామి, గోపాల్ రెడ్డి, రవీందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులను ఇబ్బంది పెడతారా?

నాయకులు మెప్పు కోసం గ్రామాల్లోని మహిళలను ఆత్మీయ సమ్మేళనాలకు తరలించి మహిళా సంఘాల సభ్యులను ఇబ్బందులు పెడతారా అంటూ వీర్లపల్లి శంకర్ ప్రశ్నించారు. పావలావడ్డీకి రుణాలు ఇప్పిస్తామంటూ మహిళలకు మాయమాటలు చెప్పి బీఆర్ఎస్ పార్టీ సమ్మేళనాలకు తరలించడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కే రాజు, నాయకులు చంద్రశేఖర్, సురేందర్, రవి, విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్, గోవర్ధన్ గౌడ్, శివకుమార్, బాలయ్య, బాను, నరేందర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.